# 17668 దిగువన ముగిస్తే దిద్దుబాటు




**సమీక్ష:** గతవారంలో రెండేళ్ల గరిష్ఠ స్థాయిని తాకిన సెన్సెక్స్ మొత్తం మీద 122 పాయింట్ల మోస్తరు లాభాన్నే పొందింది. దేశీయంగా పారిశ్రామికోత్పత్తి మే నెల గణాంకాలు అంచనాలను అందుకోలేకపోయినప్పటికీ.. మన మార్కెట్లు అంతర్జాతీయ సానుకూల పవనాలతో శుభారంభాన్నే పలికాయి. అనుకూలతలు కొనసాగడంతో బుధవారానికల్లా మార్కెట్ 18167 వద్ద రెండేళ్ల గరిష్ఠ స్థాయిని తాకింది. ఆ తర్వాత లాభాల స్వీకరణకూ గురైంది. 2010 భవిష్యత్ అంచనాలను అమెరికా ఫెడరల్ రిజర్వ్ తగ్గించడం; చైనా రెండో త్రైమాసిక జీడీపీ నెమ్మదించడం వంటివి అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం చూపాయి. మరో పక్క ఇక్కడి దిగ్గజ కంపెనీలూ త్రైమాసిక ఫలితాల్లో అంచనాలకు తగ్గట్టుగా రాణించలేకపోవడంతో సెంటిమెంటు బలహీనపడింది. దీంతో సెన్సెక్స్ 17956 వద్ద ముగిసింది.

**ఎఫ్ఐఐల తీరు:** విదేశీ సంస్థాగత మదుపుదార్లు(ఎఫ్ఐఐలు) భారీ స్థాయిలో రూ.6,594 కోట్ల నికర కొనుగోళ్లు చేయడం వల్లే అంతర్జాతీయ ప్రతికూలతలు పెద్ద ప్రభావం చూపలేకపోయాయి. అయితే మ్యూచువల్ ఫండ్లు రూ.1174 కోట్ల నికర విక్రయాలు చేయడం అధిక స్థాయుల వద్ద లాభాల స్వీకరణకు దారితీసింది.

**రంగాల వారీగా:** జూన్ నెల ద్రవ్యోల్బణం 10.55 శాతానికే పరిమితం కావడంతో వడ్డీ రేట్లతో ప్రభావితమయ్యే బ్యాంకింగ్ వంటి షేర్లలో ర్యాలీ కనిపించింది. ఎఫ్‌డీఐ నిబంధనల్లో సడలింపు ఉండొచ్చన్న వార్తల నేపథ్యంలో స్థిరాస్తి షేర్లలో కొనుగోళ్లు కనిపించాయి. ఐఐపీ గణాంకాల్లో ఆయా రంగాల భారీ వృద్ధి కారణంగా మన్నికైన వినిమయ వస్తువులు, యంత్ర పరికరాలకు చెందిన స్క్రిప్‌లూ ఎగశాయి. ప్రభుత్వ రంగ చమురు కంపెనీలకు సబ్సిడీ భారం కొనసాగనుండడంతో ఆ రంగం నష్టాలను నమోదు చేసుకుంది. ఐటీ రంగ కంపెనీల త్రైమాసిక ఫలితాలు బలహీనంగా ఉండొచ్చన్న అంచనాలతో ఐటీ షేర్లూ కుంగక తప్పలేదు. వాహన, ఆరోగ్యం సంరక్షణ రంగాల్లో లాభాల స్వీకరణ జరిగింది.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 4:3గా నమోదవడం చూస్తే కొనుగోళ్లు కొనసాగాయన్నది అర్థమవుతుంది.

**ఈ వారంపై అంచనాలు:** మార్కెట్ అంతక్రితం వారం 29 వారాల గరిష్ఠాన్ని తాకి మధ్యకాలంలో మరింత పెరుగుతుందని సంకేతాలిచ్చింది. అయితే సెన్సెక్స్ తన కీలక నిరోధ స్థాయి 18048ని దాటి 18167కు చేరినా.. ఆ స్థాయిపైన ముగియలేకపోయింది. ఈ కీలక స్థాయి పైన నిర్ణయాత్మకంగా ముగిస్తే 19000 దిశగా మార్కెట్ సాగుతుందన్న అంచనా లున్న సంగతి తెలిసిందే. స్వల్పకాలంలో 18048 వద్ద మార్కెట్ నిరోధాన్ని ఎదుర్కొంటుందన్న సంకేతాలున్నాయి.

**ప్రభావం చూపే అంశాలు:** అంతర్జాతీయ మార్కెట్ల బలహీనత కొనసాగితే మన మార్కెట్లపైనా ప్రభావం పడొచ్చు. ప్రస్తుత ఎఫ్ఐఐల ధోరణి ఇలాగే ఉంటే మార్కెట్‌కు మద్దతు లభించొచ్చు. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఎంపిక చేసిన స్క్రిప్‌లలో కదలికలు కనిపించొచ్చు. ప్రస్తుతానికి వర్షపాతం సాధారణ స్థాయి కంటే 14 శాతం తక్కువగా ఉంది. రుతుపవనాలు మరింత పుంజుకోకపోతే మార్కెట్ గరిష్ఠ స్థాయిలపై దీని ప్రభావం ఉండొచ్చు.

**తక్షణ మద్దతు స్థాయిలు:** 17715, 17536, 17396

**తక్షణ నిరోధ స్థాయిలు:** 18167, 18274, 18593

**స్వల్పకాలంలో మార్కెట్ స్థిరీకరణకు గురికావొచ్చు. ఒక వేళ 17668 కంటే దిగువన ముగిస్తే స్వల్పకాల దిద్దుబాటులోకి అడుగుపెట్టొచ్చు.**

*–సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్*